సాక్షి
నాగర్‌కర్నూల్
సోమవారం । 30 । సెప్టెంబర్ । 2024



అడ్డుకట్ట పడేనా..?

ఆర్‌ఎంపీలు స్థాయికిమించి వైద్యం చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు.

వివరాలు 8లో ▸



వేగవంతంగా విద్యుదుత్పత్తి

జూరాల జల విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి వేగవంతంగా కొనసాగుతోంది.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
35.8 /22.1

రోజంతా ఆకాశం నిర్మానుష్యంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతమై ఓ మోస్తరు జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేడు డయల్ యువర్ డీఎం

కొల్లాపూర్: డిపో పరిధిలో ఆర్టీసీ బస్సుల రవాణాకు సంబంధించిన సమస్యలు, సలహాల కోసం సోమవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ ఉమాశంకర్ తెలిపారు. ప్రయాణికులు సాయంత్రం 4 నుంచి 5 వరకు తమ సలహాలు, సూచనలను సెల్‌ఫోన్ నంబర్ 90004 05878లో తెలియజేయాలని సూచించారు.

పనులు అడ్డుకుంటే చర్యలు

బల్మూర్: మండలంలోని మైలారం గుట్టపై మైనింగ్ తవ్వకాలకు అనుమతి ఉందని.. అడ్డుకుంటే చర్యలు తప్పవని అచ్చంపేట డీఎస్పీ శ్రీనివాసులు హెచ్చరించారు. ఆదివారం ఆయన స్థానిక పోలీస్‌స్టేషనలో విలేకర్లతో మాట్లాడారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా పికెటింగ్ ఏర్పాటు చేశామన్నారు. తవ్వకాలు చేపట్టవద్దని ఇటీవల జరిగిన దాడుల ఘటనలో 10 మందిపై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. గ్రామస్తులు ఘర్షణలకు పాల్పడకుండా న్యాయపరంగా పోరాడాలని సూచించారు. కాగా మైలారం గుట్టపైకి ఆదివారం రహదారి పనులు ప్రారంభం కావడంతో శాంతిభద్రతల దృష్ట్యా ముందుజాగ్రత్తగా సీఐ రవీంధర్, ఎస్‌ఐలు గురుస్వామి, లెనిన్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు.

సనాతన ధర్మాన్ని పరిరక్షించాలి



నాగర్‌కర్నూల్ (బిజినేపల్లి): హిందూధర్మ పరిరక్షణకు ప్రతి ఒక హిందువు గళం విప్పాలని.. ప్రతి ఇంటి నుంచి ఒక సైనికుడు తయారై సనాతన ధర్మాన్ని కాపాడాలని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు శశిధర్ పిలుపునిచ్చారు. ఆదివారం వట్టెం వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో వీహెచ్‌పీ జిల్లా విస్తృతస్థాయి సమావేశం నిర్వహించగా.. ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో మెజార్టీగా ఉన్న హిందువులు సనాతన ధర్మాన్ని పరిరక్షించడం, హిందువులపై దాడులను ప్రశ్నించడంలో మైనార్టీలుగా మారామన్నారు. ఇప్పటికీ మేల్కొనకపోతే మరో రెండు దశాబ్దాల్లో మైనార్టీలం అవుతామని తెలిపారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు శివయ్యగౌడ్, ప్రకండ అధ్యక్షుడు కర్నాటి తిరుపతయ్య పాల్గొన్నారు.

మహిళల హక్కులకు ఉద్యమించాలి : ఐద్వా

నాగర్‌కర్నూల్ రూరల్: మహిళలకు జరుగుతున్న అన్యాయాలపై నాయకులు ప్రభుత్వంతో చర్చించాల్సిన అవసరం ఉందని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి అన్నారు. ఆదివారం స్థానిక సింగిల్‌విండో కార్యాలయంలో నిర్వహించిన ఐద్వా జిల్లాస్థాయి సమావేశానికి ఆమె హాజరై మాట్లాడారు. మహిళల హక్కులు, రక్షణ, కనీస వేతనం, ఉపాధి కల్పనకు ఐక్యంగా పోరాడాలని సూచించారు. మహిళలు వారి సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉద్యమించాల్సిన అవసరం ఉందని.. ప్రజలను చైతన్యవంతం చేయాలన్నారు.

అన్నదాతల ఆందోళన



'ఈ ఫొటోలోని రైతు పేరు కదారి చంద్రయ్య. జిల్లాలోని అమ్రాబాద్ మండలం మన్ననూర్ ఎస్‌బీఐలో రూ.1.60 లక్షల పంట రుణం తీసుకున్నారు. ఇటీవల ప్రభుత్వం చేపట్టిన పంట రుణమాఫీ వర్తించకపోవడంతో వ్యవసాయ అధికారుల వద్ద దరఖాస్తు చేసుకున్నారు. పంట రుణం వడ్డీతో కలిపి మొత్తం రూ.2.28 లక్షలు చెల్లించాలంటూ తాజాగా బ్యాంకు అధికారులు నోటీసు ఇచ్చారు. జిల్లావ్యాప్తంగా రుణమాఫీ కాని రైతులకు బ్యాంకులు నోటీసులు జారీ చేస్తుండటంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.'



జిల్లాలో నేటికీ పూర్తికాని పంట రుణమాఫీ

- వ్యవసాయ అధికారుల చుట్టూ రైతుల ప్రదక్షిణలు
- బ్యాంకు నోటీసులతో బెంబేలు
- జిల్లాలో 20 వేల మందికిపైగా..

సాక్షి, నాగర్‌కర్నూల్, మన్ననూర్: ప్రభుత్వం పంట రుణమాఫీ ప్రక్రియ చేపట్టి సుమారు రెండున్నర నెలలు కావస్తున్నా.. ఇంకా కొంతమంది రైతులు రుణమాఫీకి నోచుకోవడం లేదు. జిల్లావ్యాప్తంగా ఇంకా 23,179 మందికి రుణమాఫీ కావాల్సి ఉందని.. ప్రధానంగా రేషన్‌కార్డు లేకపోవడం, ఫ్యామిలీ గ్రూపింగ్ కాకపోవడం, ఆధార్ లింక్, సింగిల్ ఫార్మర్, రూ.2 లక్షలకు మించి రుణం ఉండటం తదితర కారణాలతో రుణమాఫీ వర్తించలేదని అధికారులు చెబుతున్నారు. అయితే ప్రభుత్వం చెప్పినట్టుగా రూ.2 లక్షల్లోపు రుణాలను త్వరగా మాఫీ చేయాలని రైతులు కోరుతున్నారు. ఇందుకోసం వ్యవసాయశాఖ అధికారులు, బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు.

నిర్ణీత గడువులోని రుణాలకే..

2018, డిసెంబర్ 12 నుంచి 2023, డిసెంబర్ 13 వరకు తీసుకున్న పంట రుణాలకు మాత్రమే మాఫీ వర్తిస్తుందని ప్రభుత్వం పేర్కొంది. అయితే ఈ గడువులోగా రుణం తీసుకున్న చాలామందికి మాఫీ కాకపోవడంతో వారంతా ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం మొదటి విడతలో 46,780 మంది, రెండో విడతలో 30,501 మంది, మూడోవిడతలో 21,352 మంది రైతులకు రుణమాఫీ చేసింది. జిల్లా వ్యాప్తంగా ఇంకా 23,179 మందికి ప్రభుత్వం నుంచి రుణమాఫీ కాలేదు. రుణమాఫీ పొందేందుకు రైతులు వ్యవసాయ అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా ఇప్పటి వరకు 16,649 మంది రైతుల వివరాలను ఫ్యామిలీ గ్రూపింగ్ చేసిన అధికారులు ఆన్‌లైన్‌లో పొందుపర్చారు. మిగతా వారి నుంచి వివరాలు సేకరిస్తున్నారు. పెండింగ్‌లో ఉన్న వారిలో అర్హులను గుర్తించి ప్రభుత్వం రుణమాఫీ చేస్తుందని అధికారులు చెబుతున్నారు.

ప్రభుత్వానికి నివేదించాం..

జిల్లాలో పంట రుణమాఫీ వర్తించని రైతుల వివరాలను సేకరించి ప్రభుత్వానికి నివేదించాం. బ్యాంకుల నుంచి వచ్చే నోటీసులకు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ప్రభుత్వ నిర్ణయం మేరకు అర్హులైన అందరికీ మాఫీ వర్తిస్తుంది.

– చంద్రశేఖర్, జిల్లా వ్యవసాయ అధికారి, నాగర్‌కర్నూల్

నోటీసుల జారీతో..

జూలై 18న ప్రభుత్వం రుణమాఫీ ప్రక్రియను ప్రారంభించగా ఈ ప్రక్రియ ఇంకా కొనసాగుతోంది. మరోవైపు వడ్డీతో సహా రుణాలు చెల్లించాలంటూ బ్యాంకులు పంట రుణమాఫీకాని రైతులకు నోటీసులు జారీ చేస్తుండటంతో ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే జిల్లాలోని పలు మండలాల బ్యాంకులు రైతులకు నోటీసులు జారీ చేశాయి. రుణమాఫీ పొందినా గతేడాది డిసెంబర్ నుంచి ఇప్పటి వరకు సుమారు 8 నెలల వడ్డీని రైతులే బ్యాంకులకు చెల్లించాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం త్వరగా అర్హులైన వారిని గుర్తించి రుణమాఫీ ప్రక్రియ పూర్తిచేయాలని రైతులు కోరుతున్నారు.



BEFORE MANDAL LEGAL SERVICES COMMITTEE, ACHAMPETA

BRANCH MANAGER
STATE BANK OF INDIA
ACB MUNNANUR

బ్యాంకు అధికారులు జారీచేసిన నోటీసు

పాఠశాలల అభివృద్ధికి కృషి

- రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

కొల్లాపూర్: నియోజకవర్గంలో పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తానని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆదివారం పట్టణంలోని సంతబజార్‌లో ఉన్న ఆర్‌ఐడీ పాఠశాల భవన మరమ్మతు పనులను ఆయన పరిశీలించారు. నవంబర్‌లో పాఠశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఉన్నందున కొన్నిరోజులుగా మరమ్మతులు కొనసాగుతుండగా.. మంత్రి పనులను పరిశీలించి కాంట్రాక్టర్‌తో మాట్లాడి పురోగతిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. పాఠశాలకు ఎంతో చరిత్ర ఉందని.. ఇక్కడ చదువుకున్న విద్యార్థులు ఎందరో ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారని వివరించారు. వారందరినీ వేడుకలకు ఆహ్వానించి సంబరాలు నిర్వహించేందుకు పూర్వ విద్యార్థులు ముందుకురావడం శుభ పరిణామమన్నారు. సమ్మేళనం నాటి వరకు పాఠశాలను సుందరంగా ముస్తాబు చేయాలని.. పనుల్లో నాణ్యత లోపించొద్దని తెలిపారు. పాఠశాల పరిసరాలను శుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి వివరించారు. మంత్రి సోదరుడు జగన్మోహన్‌రావు, విశ్రాంత డీఆర్‌ఓ మదన్‌మోహన్‌రావు, మేకల నాగరాజు, రహీంపాషా, కృష్ణమనాయుడు, రెడ్డి సత్యం, ముస్తాక్ ఉన్నారు.



పాఠశాల పరిసరాలను పరిశీలిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

అక్టోబర్ 2న ఉమ్మడి జిల్లా జట్ల ఎంపిక

కల్వకుర్తి రూరల్: పట్టణంలోని సిల్వర్‌జూబ్లీ క్లబ్ ఆవరణలో అక్టోబర్ 2న ఉమ్మడి జిల్లా బాల్ బ్యాడ్మింటన్ జూనియర్ విభాగం బాలుర, బాలికల ఎంపిక నిర్వహించనున్నట్లు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిమ్ముల శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఆదివారం కల్వకుర్తిలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. అక్టోబర్ 4, 5, 6 తేదీల్లో నిజామాబాద్ జిల్లా కామారెడ్డిలో రాష్ట్రస్థాయి పోటీలు ఉంటాయని.. పోటీల్లో పాల్గొనే జట్లను ఎంపిక చేయనున్నట్లు చెప్పారు. 2005, జనవరి 2 తర్వాత జన్మించిన వారు అర్హులని, ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు తమ ఒరిజినల్ ధ్రువ పత్రాలతో హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు సెల్‌ఫోన్ నంబర్లు 80198 48013, 90009 05215 సంప్రదించాలని కోరారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షులు అజీమ్, భాస్కర్‌గౌడ్ పాల్గొన్నారు.

వినోదం.. విజ్ఞానం.. వికాసం



ఏనుగొండ కేజీబీవీలో చదువుతున్న విద్యార్థులు (ఫైల్)

నాలుగు గోడల మధ్య కూర్చోబెట్టి బోధించడమే కాకుండా.. నేరుగా కొత్త అంశాలు చూపిస్తే విద్యార్థులు బాగా అర్థం చేసుకుంటారు. పర్యాటక ప్రదేశాలు.. ఆలయాలు.. ప్రాజెక్టులు ఇలా వివిధ ప్రాంతాలకు వెళ్లి వాటిపై అవగాహన కల్పిస్తే.. కొత్త విషయాలు తెలుసుకొని వారిలో నూతన ఆలోచనలు.. వివిధ ప్రాజెక్టులు రూపొందించేందుకు ఊతం.. వ్యక్తిత్వ వికాసానికి ఎంతో ఉపయోగపడతాయి. ఇదే తలంపుతో రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక పాఠశాల నుంచి డిగ్రీ వరకు విద్యార్థుల విహారయాత్రలకు నిధులు అందించనుంది.

విద్యార్థుల విహారయాత్రలకు నిధులు అందించనున్న ప్రభుత్వం

- ప్రాథమిక పాఠశాలల నుంచి డిగ్రీ వరకు అవకాశం
- అటు పర్యాటకానికి ఊతం.. ఇటు విద్యార్థులకు మానసికోల్లాసం
- ఉమ్మడి జిల్లాలో 3.50 లక్షల మందికి పైగా విద్యార్థులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: విద్యార్థులు విహారయాత్రలకు వెళ్లేందుకు ప్రభుత్వం అనుమతి ఇవ్వడంతోపాటు వారు వచ్చి వెళ్లేందుకు అయ్యే ఖర్చులను కూడా భరిస్తుంది. ఇందుకు సంబంధించి విధివిధానాలపై ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో పాఠశాలలు, కళాశాల నుంచి విజ్ఞానయాత్రల పేరుతో ఉపాధ్యాయులు విద్యార్థులను పలు చారిత్రాత్మక, దర్శనీయ ప్రదేశాలు, పార్కులు, భౌగోళిక ప్రాధాన్యత కలిగిన ప్రదేశాలు చూసేందుకు తీసుకెళ్లేవారు. అందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చేది కాదు. కేవలం ఉపాధ్యాయులు పాఠశాలల తరఫున విద్యార్థులను తీసుకెళ్లేవారు. కానీ, ప్రస్తుతం నేరుగా ప్రభుత్వమే నిధులు మంజూరు చేయడంపై విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పాఠశాలల్లో 2.50 లక్షల మంది, ఇంటర్మీడియట్‌లో 68 వేల మంది, డిగ్రీ, పీజీలో 85 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ కార్యక్రమం ద్వారా రెండు విధాలా లాభం చేకూరనుంది. ఇటు విద్యార్థులకు సబ్జెక్టు పరంగా ఉపయోగపడడంతోపాటు టూరిజం పరంగా స్థానికంగా ఉండే వారికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

టూరిజం క్లబ్‌లు ఏర్పాటు..

విద్యార్థులు పర్యాటక ప్రదేశాలను సందర్శించడం ద్వారా టూరిజాన్ని అభివృద్ధి చేయడంతోపాటు విద్యార్థులకు కూడా సబ్జెక్టు పరంగా ఎంతో ఉపయోగపడుతుందని ప్రభుత్వం భావిస్తుంది. అందులో భాగంగా జిల్లాలోని వివిధ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులతో అధికారులు టూరిజం క్లబ్‌లను ఏర్పాటు చేశారు. మహబూబ్‌నగర్ జిల్లావ్యాప్తంగా 1,400లకు పైగా టూరిజం క్లబ్‌లను ఏర్పాటు చేసినందుకుగాను కలెక్టర్ ప్రభుత్వం నుంచి అవార్డును సైతం అందుకున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 3 వేలకు పైగా క్లబ్‌లను ఏర్పాటు చేశారు. వీటి ద్వారా విద్యార్థులకు సైకిల్ ర్యాలీలు, మారథాన్, అవగాహన కార్యక్రమాలు, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నారు. ఈ క్రమంలో క్లబ్‌ల ద్వారా విద్యార్థులకు, ఇతర ప్రజలకు ఉమ్మడి జిల్లాలోని ఆలయాలు, చారిత్రాత్మక కట్టడాలు, దర్శనీయ ప్రదేశాలు, పార్కులు తదితర వాటిపై అవగాహన కల్పించనున్నారు.

ఉమ్మడి జిల్లాలో పాఠశాలలు, విద్యార్థుల వివరాలిలా..

జిల్లా	పాఠశాలలు	విద్యార్థులు
మహబూబ్‌నగర్	791	62,724
నాగర్‌కర్నూల్	808	54,152
వనపర్తి	495	38,147
జోగులాంబ గద్వాల	448	55,289
నారాయణపేట	458	52,314

విధివిధానాలు ఇలా..

తరగతులు	టూర్ వెళ్లే రోజులు	ఒక్కో విద్యార్థికి ఇచ్చే నిధులు (రూ.లలో)	ప్రయాణ దూరం (కి.మీ.)
2, 3, 4	1	300	అదే గ్రామం, మండలం
5,6,7,8	1	800	20 - 30
9 నుంచి ఇంటర్ వరకు	2	2,000	50 - 70
డిగ్రీ, పీజీ	4	4,000	రాష్ట్రంలో ఎక్కడైనా

విద్యార్థులకు ఎంతో మేలు



ప్రభుత్వం విద్యార్థులకు విహారయాత్రలకు వెళ్లేందుకు ఉత్తర్వులు జారీ చేసింది. అందులో వివిధ కేటగిరీల విద్యార్థులు ఎంత దూరం వెళ్లాలి, ఎన్ని నిధులు కేటాయిస్తారు అనే అంశంపై స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయి. వారు వెళ్లేందుకు నిధులు ప్రభుత్వం విడుదల చేస్తుంది. అందుకు ఏఏ ప్రదేశాలకు వెళ్లాలి అనే అంశంపై ఒక కమిటీ నిర్ణయం తీసుకుంటుంది. ఇప్పటికే టూరిజం క్లబ్‌లను కలెక్టర్ ఆదేశాలతో ఏర్పాటు చేశాం.

– రవీందర్, డీఈఓ, మహబూబ్‌నగర్

పర్యాటక రంగానికి



ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం జిల్లాకు, విద్యార్థులకు ఎంతో మేలు చేస్తుంది. రెండో తరగతి నుంచి డిగ్రీ వరకు చదువుతున్న విద్యార్థులకు ఇలాంటి అవకాశం కల్పించడం చాలా గొప్ప విషయం. ఉమ్మడి జిల్లా ప్రాముఖ్యత తెలుసుకునే అవకాశం విద్యార్థులకు లభిస్తుంది. పర్యాటక రంగానికి కూడా చాలా ఉపయోగపడుతుంది. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.

– వెంకటేశ్వర్లు, జిల్లా పర్యాటకశాఖ అధికారి, మహబూబ్‌నగర్

ప్రసాద్ స్కీం భవనంలోకి.. జోగుళాంబ నిత్యాన్నదాన సత్రం



ప్రసాద్ స్కీం భవన సముదాయం

- భోజనశాల, డైనింగ్ హాల్‌ను దేవస్థానానికి అప్పగించిన పర్యాటక శాఖ
- సిబ్బంది కొరత.. నిర్వహణ భారంతో దేవస్థానం అధికారుల మీనమేషాలు

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ జోగుళాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి భక్త యాత్రికుల సౌకర్యార్థం తుంగభద్ర నది తీరాన.. మూడెకరాల స్థలంలో ఆహ్లాదకరమైన వాతావరణంలో.. అధునాతన వసతులతో నిర్మించిన భవనం త్వరలోనే అందుబాటులోకి రానుంది. ప్రసాద్ స్కీంలో రూ.38 కోట్లతో చేపట్టిన భవన నిర్మాణ పనులు 85 శాతం పూర్తయ్యాయి. అందుకోసం రూ.28 కోట్ల మేర వెచ్చించారు. ప్రసాద్ స్కీం భవనంలో అన్నదాన సత్రం, కల్యాణ మండపం, వసతి గదులు, డైనింగ్ హాల్, మరుగుదొడ్లు, మూత్రశాలలు, గ్రీనరీ, తాగునీటి వసతి తదితర సౌకర్యాలు కల్పించారు. గత మార్చి 7న ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేతులమీదుగా వర్చువల్‌గా భవనాన్ని ప్రారంభించారు. రోజురోజుకూ జోగుళాంబ క్షేత్రానికి యాత్రికుల తాకిడి పెరుగుతుండటంతో ఎంత మాత్రం ఆలస్యం చేయకుండా ప్రసాద్ స్కీం భవనంలో అన్నదాన సత్రం నిర్వహణకు గాను భోజనశాల, డైనింగ్‌హాల్ దేవస్థానానికి అప్పగిస్తూ.. పర్యాటక శాఖ అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది.



భవనంలోని భోజనశాల

దేవస్థానం అధికారుల వెనకడుగు..

ప్రసాద్ స్కీం భవన సముదాయంలో అన్నదాన సత్రం, డైనింగ్ హాల్ నిర్వహణ చేపట్టేందుకు దేవస్థానం అధికారులు వెనకడుగు వేస్తున్నట్టు తెలుస్తోంది. దేవస్థానానికి ఏటా రూ.4 కోట్ల ఆదాయం వస్తోంది. దేవాదాయశాఖ నిబంధనల మేరకు ఈ ఆదాయంలో 30 శాతానికి మించి ఖర్చు చేయరాదనే నిబంధన ఉంది. ఇప్పటికే దేవస్థానంలో సుమారు 60 మంది దాక సిబ్బంది ఉన్నారు. ఇప్పుడు ప్రసాద్ స్కీం భవనం స్వాధీనం చేసుకుని, అక్కడ అన్నదాన సత్రం నిర్వహణ చేపట్టాలంటే కనీసం మరో 10 మంది సిబ్బంది అవసరం. భవన సముదాయంలోని గ్రీనరీ, వసతి గదుల శుభ్రతకు మరో 60 మంది సిబ్బంది దాక అవసరం. ఇంత మందికి వేతనాలు ఇచ్చే స్తోమత దేవస్థానానికి లేదు. ఇదిలా ఉంటే.. అన్నదాన సత్రం నిర్వహణకు దేవాదాయశాఖ ముందుకు వస్తే.. భవనం విద్యుత్ బిల్లు భారం, సిబ్బంది వేతనాలు, అన్నదానానికి అయ్యే ఖర్చులు తదితర అంశాలు పరిగణలోకి తీసుకుని మీనమేషాలు లెక్కిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక సముదాయంలోని వసతి గదులను పర్యాటక శాఖ, యాంపీ థియేటర్‌ను సాంస్కృతిక శాఖ లేదా రాష్ట్ర పురావస్తు శాఖకు అప్పగించే యోచనలో ఉన్నట్టు సమాచారం.

అధికారుల దృష్టికి తీసుకెళ్తాం..



అన్నదాన సత్రం నిర్వహించేందుకు దేవస్థానం సిద్ధంగా ఉంది. అయితే భోజనశాలకు కావాల్సిన ఫర్నిచర్, అదనపు సిబ్బంది, ఖర్చులు ఇతర సాంకేతిక సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లాం. అక్టోబర్ 3న భోజనశాల, డైనింగ్ హాల్ స్వాధీనం చేసుకునే యోచనలో ఉన్నాం.

– పురేందర్‌కుమార్, ఆలయ ఈఓ

వసతి గదులకు టెండర్..



ప్రసాద్ స్కీం భవనంలోని అధునాతన వసతి గదులను టెండర్‌కు ఇచ్చే యోచనలో ఉన్నాం. అలాగే కల్యాణ మండపాన్ని దేవస్థానానికి అద్దెకు అప్పగించే ఆలోచనలో ఉన్నాం. ఈ విషయమై ఆలయ ఈఓతో చర్చించాం.

– ప్రకాశ్‌రెడ్డి, ఎండీ, పర్యాటకశాఖ

ఉత్తర్వులు జారీ చేశాం..



ప్రసాద్ స్కీం భవనంలో భోజనశాల, డైనింగ్ హాల్, విద్యుత్, నీటి సదుపాయాలన్నీ సిద్ధం చేశాం. భోజనశాల, డైనింగ్ హాల్‌ను దేవస్థానానికి అప్పగిస్తూ ఉత్తర్వులు కూడా జారీ చేశాం. వారు స్వాధీనం చేసుకోవడమే తరువాయి.

– మధుసూదన్‌రెడ్డి, ఏఈ, పర్యాటకశాఖ


దేవస్థానానికి అప్పగించాలి..



ఆలయానికి వచ్చే భక్త యాత్రికుల సౌకర్యార్థం నిర్మించిన భవన సముదాయాన్ని పూర్తిగా దేవస్థానానికి అప్పగిస్తే ఏ సమస్య ఉండదు. లేని పక్షంలో వేర్వేరు శాఖల మధ్య సమన్వయ లోపం ఏర్పడవచ్చు.

– సంజీవనాయుడు, కార్యదర్శి, వివేకానంద యూత్

జల సవ్వడి..



జిల్లాలోని అమ్రాబాద్ మండలం జంగంరెడ్డిపల్లి అటవీ ప్రాంతంలో బుగ్గల, పాటెమ్మచేన్ వాగులు వర్షాకాలంలో పారుతుంటాయి. వేర్వేరు ప్రాంతాల నుంచి వచ్చే ఈ రెండు వాగులు ఒకేచోట కలిసే ప్రాంతాన్ని గుండం అంటారు. ఎత్తైన కొండ నుంచి నీరు లోయలోకి జారుతుంది. ఆ నీరంతా అడవిలో పారుతూ అచ్చంపేట మండలం మర్లపాడుతండా సమీపం నుంచి దుందుభి నదిలో కలుస్తోంది. అయితే గుండం ప్రదేశంలోని జలపాతం సందర్శకులను ఎంతగానో ఆకట్టుకుంటుంది. నిత్యం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకులు జలపాతంలో జలకాలాడుతూ ఆనందంగా గడుపుతున్నారు.

– అమ్రాబాద్

క్లుప్తంగా

చేపలవేటకు వెళ్లి వ్యక్తి మృతి


ఉప్పరిపల్లి బాల్‌రాజు(ఫైల్)

ఖిల్లాఘనపురం: చేపల వేటకు వెళ్లి వలలో చిక్కుకుని వ్యక్తి మృతి చెందిన సంఘటన ఖిల్లాఘనపురం మండలం మానాజీపేటలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మానాజీపేటకు చెందిన ఉప్పరిపల్లి బాలరాజు(52) అదే గ్రామానికి చెందిన నాగన్నతో కలిసి శనివారం సాయంత్రం 4గంటల సమయంలో చేపల వేటకు వెళ్లారు. బండకుంటలో చేపలు పట్టే సమయంలో బాలరాజు కాళ్లకు వల చుట్టుకొని నీటిలో మునిగిపోయాడు. చాలా సేపు బయటకి రాకపోవడంతో ఒడ్డుపై ఉన్న నాగన్న కేకలు వేశాడు. రాత్రి 7గంటలు దాటినా భర్త ఇంటికి రాలేదని అతని భార్య అలివేలు బండకుంట దగ్గరకు చుట్టుపక్కల వారితో కలిసి వెళ్లింది. ఒడ్డున నాగన్న కేకలు విని పరుగున వెళ్లి కుంటలో బాలరాజును బయటికి తీశారు. అప్పటికే బాలరాజు మృతిచెందడంతో కుటుంబ సభ్యులు బోరున విలపించారు. అలివేలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు. బాలరాజుకు ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు.

చికిత్సపొందుతూ మరొకరు..

మక్తల్: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం మక్తల్ పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఒరిస్సా రాష్ట్రానికి చెందిన జగదీశ్వర్ మాసి(46) ఈనెల 20న మక్తల్‌లో ప్రసాద్‌కు చెందిన ఇటుక బట్టిలో పనిచేస్తున్నాడు. 24న మక్తల్‌కు వెళ్లి వస్తానని తన స్నేహితులకు చెప్పివెళ్లాడు. మక్తల్ నుంచి రాయచూర్‌కు వెళ్లే రహదారిపై నడుచుకుంటూ వెళ్తున్న సమయంలో దాసర్‌దొడ్డి గ్రామ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో స్థానికులు వెంటనే 108కు సమాచారం అందించి మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి హైదరాబాద్ గాంధీకి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మృతి చెందాడు. ఈ సంఘటనపై అతని భార్య గోమాతి మాజయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ భాగ్యలక్ష్మీరెడ్డి తెలిపారు.

మృతదేహం లభ్యం

లింగాల: నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండల కేంద్రం సమీపంలో దారారం వెళ్లే మార్గంలో పంట పొలంలో గుర్తు తెలియని యువకుడి మృతదేహం లభ్యమైన సంఘటన ఆదివారం వెలుగు చూసింది. పంటపొలం సమీపంలో మేకలు, గొర్రెలు మేపుతున్న కాపరులకు గడ్డి పొదల్లో మృత దేహం కనిపించడంతో చుట్టుపక్కల రైతులకు తెలిపారు. మృతుని శరీరంపై నీలం రంగు ప్యాంట్, గళ్ల షర్టు ఉండగా, 30 నుంచి 35 ఏండ్ల వయస్సు ఉంటుందని అనుమానిస్తున్నారు. కుడి చేతిలో సెల్‌ఫోన్ ఉంది. ఈ సమాచారం తెలుసుకున్న ఎస్‌ఐ జగన్‌మోహన్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుని మొఖం కనిపించని విధంగా కుళ్లి పోయింది. రెండు, మూడు రోజుల క్రితం చని పోయి ఉండొచ్చని భావిస్తున్నారు. సెల్‌ఫోన్ ఆధారంగా మృతుడు ఎవరనేది పోలీసులు సమాచారం సేకరించే ప్రయత్నం చేస్తున్నారు. మృతదేహాన్ని అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

130 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

ఉండవెల్లి: అక్రమంగా తరలిస్తున్న 130 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్న సంఘటన ఆదివారం అలంపూర్ చౌరస్తాలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ మహేష్ వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ సత్యసాయి జిల్లా, ధర్మవరం మండలం, ఎల్‌సీకే పురం గ్రామానికి చెందిన రాజశేఖర్ డీసీఎంలో 260 బ్యాగుల్లో పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా అలంపూర్ చౌరస్తాలో ఫ్లైఓవర్ బ్రిడ్జిపై పోలీసులు పట్టుకున్నారు. వాహనాన్ని సంబంధించిన పత్రాలు లేకపోవడంతో డీసీఎంను సీజ్ చేశారు. డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆగడాలకు అడ్డుకట్టపడేనా?



న్యూలైఫ్ ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తున్న బాధితులు, నాయకులు (ఫైల్)

- అర్హతకు మించి వైద్యం చేస్తున్న ఆర్‌ఎంపీలు
- ప్రాణాలు తీస్తున్నా.. అసభ్యకరంగా ప్రవరిస్తున్నా పట్టించుకోని వైనం
- చూసిచూడనట్లు వ్యవహరిస్తున్న వైద్య ఆరోగ్యశాఖ అధికారులు

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లాలోని ఆర్‌ఎంపీలు ప్రజల ధన, మాన, ప్రాణాలతో చెలగాటమాడుతూ రూ.లక్షల్లో సంపాదిస్తున్నారు. నిత్యం ఎక్కడో ఒకచోట ఆర్‌ఎంపీల ఆగడాలకు అమాయక ప్రజలు బలవుతున్నారు. ప్రథమ చికిత్సకే పరిమితం కావాల్సిన ఆర్‌ఎంపీలు స్థాయికి మించి వైద్యం చేస్తూ ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. కొందరైతే జిల్లాలో కార్పొరేట్ స్థాయిలో ఆస్పత్రులను ఏర్పాటు చేసి బహిరంగంగా వైద్యం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. కాగా ఈనెల 18న జిల్లా కేంద్రంలోని జనరల్ ఆస్పత్రి ఎదుట.. ఓ ఆర్‌ఎంపీ నిర్వహిస్తున్న ఆస్పత్రికి తాడూరు మండలానికి చెందిన ఓ వివాహిత జ్వరంతో వైద్యం కోసం రాగా అసభ్యకరంగా ప్రవర్తించడం గమనార్హం. దీంతో ఆస్పత్రి వద్ద బాధిత కుటుంబసభ్యులతో పాటు పలు రాజకీయపార్టీలు ఆందోళనకు దిగాయి. పోలీసులు అక్కడికి చేరుకుని ఆందోళన విరమింపజేశారు. ఆర్‌ఎంపీ మహ్మద్‌సమీపై నిర్భయ కేసునమోదు చేశారు. ఇలా తరుచూ ఘటనలు చోటు చేసుకుంటూనే ఉన్నాయి.

తీరుమారని ఆర్‌ఎంపీలు

సాధారణంగా ఆర్‌ఎంపీలు ప్రథమ చికిత్స వరకు మాత్రమే పరిమితం కావాల్సి ఉంటుంది. కానీ జిల్లా పరిధిలో ఎక్కడ చూసిన అంతకు మించి మేమే వైద్యులం అన్న తరహాలో వారి ఆగడాలు శ్రుతి మించుతున్నాయి. దీంతో అమాయకులు బలవుతున్నారు. ఆపరేషన్లు, గర్భస్రావాలు ఇలా వారికి తెలియని వైద్యమే లేదన్నట్లు ఇష్టానుసారం వ్యవహరిస్తూ.. ఏకంగా వైద్యశాలలను నిర్వహిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో ప్రాణాలు పోతే వాటిని మరుగున పడేలా చేసేందుకు బాధితులతో బేరసారాలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. రోగుల ప్రాణాలు పోయినపుడు ఆందోళన చేసినప్పుడల్లా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు వచ్చి హడావుడి చేసి చర్యలు తీసుకుంటామని చెప్పి వెళ్లిపోవడం.. తిరిగి ఆర్‌ఎంపీల ఆగడాలు షరామామూలుగానే జరుగుతున్నట్లు తెలుస్తోంది.

నాగర్‌కర్నూల్ జిల్లాగా మారినప్పటి నుంచి చాలా మంది వైద్యులు నూతనంగా కార్పొరేట్ స్థాయిలో ఆస్పత్రులను నెలకొల్పుతున్నారు. వీరు ఆదాయం పెంచుకునేందుకు ఆర్‌ఎంపీలకు కమీషన్లు ముట్టజెపుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలోనే తమ వద్దకు వచ్చే రోగులకు అనవసరంగా టెస్టులు రాయడంతో పాటు ఆపరేషన్లు చేయాలని చెప్పి జిల్లాలో తమకు అనుకూలంగా ఉండే వైద్యుల వద్దకు రోగులను ఆర్‌ఎంపీలు రెఫర్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వారిని కట్టడిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు అభిప్రాయ పడుతున్నారు. అదేవిధంగా ప్రతినెలా ఆర్‌ఎంపీల క్లినిక్‌లను తనిఖీ చేయాల్సిన అవసరం ఉందని చెబుతున్నారు.

కఠిన చర్యలు తీసుకుంటాం



జిల్లాలోని ఆర్‌ఎంపీలు స్థాయికి మించి వైద్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఆర్‌ఎంపీల క్లినిక్‌లను తనిఖీ చేయడంతో పాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాం. జిల్లా కేంద్రంలోని ఆర్‌ఎంపీ వైద్యుడు మహ్మద్‌సమీకి వివాహిత విషయంలో ఇప్పటికే షోకాజ్ నోటీసు జారీ చేశాం. కలెక్టర్ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.
– డా.స్వరాజ్య లక్ష్మి, డీఎంహెచ్‌ఓ, నాగర్‌కర్నూల్

ట్రాక్టర్ బోల్తా: ఇద్దరు రైతుల దుర్మరణం

జడ్చర్ల: విద్యుత్ స్తంభాల లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్ బోల్తా పడి ఇద్దరు రైతులు దుర్మరణం పాలైన సంఘటన ఆదివారం 167 జాతీయ రహదారి గంగాపూర్ శివారులో చోటుచేసుకుంది. మండలంలోని చిన్నఆదిరాలకు చెందిన కొందరు రైతులు ట్రాన్స్‌ఫార్మర్ కోసం డీడీలు చెల్లించారు. దానికి సంబంధించిన స్తంభాలను తీసుకెళ్లేందుకు జడ్చర్ల విద్యుత్ శాఖ కార్యాలయానికి వచ్చారు. 11 విద్యుత్ స్తంభాలను ట్రాక్టర్‌లో లోడ్ చేసి తీసుకెళ్తున్న క్రమంలో గంగాపూర్ శివారులో జాతీయ రహదారిపై ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో చిన్నఆదిరాలకు చెందిన రైతు పబ్బతి జంగయ్య(55) అక్కడికక్కడే దుర్మరణం చెందగా, మరో రైతు ఏదుల జంగయ్య(50) జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మృతి చెందాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. నిబంధనల ప్రకారం విద్యుత్ స్తంభాలను సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్ తరలించాలి. ఆ బాధ్యతను రైతులపైకి నెట్టడంతో రైతులు వాటిని తరలించేందుకు వెళ్లి ప్రాణాలు పోగొట్టుకున్నారని పలువురు రైతులు తెలిపారు. పబ్బతి జంగయ్యకు భార్య కళావతి, కుమారుడు ఉన్నారు. ఏదుల జంగయ్యకు భార్య అంజమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుల కుటుంబాలకు రూ.20 లక్షల చొప్పున ఎక్స్ గ్రేషియా చెల్లించాలని మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆయా కుటుంబాలను ఆయన పరామర్శించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఆదిరెడ్డి తెలిపారు.

మినీ బస్సును ఢీకొట్టిన డీసీఎం

- ఒకరు మృతి, ముగ్గురికి తీవ్ర గాయాలు


సయ్యద్‌ముస్తాఫా (ఫైల్)


ప్రమాదానికి కారణమైన డీసీఎం

కొత్తకోట రూరల్: శుభ కార్యానికి వంటలు చేసేందుకు వెళ్తున్న మినీ బస్సు టైర్ పంచర్ అయ్యింది. టైర్ మార్చుతున్న క్రమంలో డీసీఎం మినీ బస్సును ఢీకొట్టింది. రోడ్డు పక్కన ఉన్న వారిలో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన కొత్తకోట 44వ జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని మలక్‌పేట, చాదర్‌ఘట్‌కు చెందిన షేక్ హుస్సేన్ కర్నూల్‌లో పెళ్లి ఫంక్షన్‌లో వంటలు చేసేందుకు మహ్మద్ అజీమ్, సయ్యద్ ముస్తఫా, కూలీలు వి.రవినాయక్, మరి కొందరితో మినీబస్సును అద్దెకు తీసుకుని శనివారం రాత్రి సుమారు 10: 30 గంటలకు బయలు దేరారు. వనపర్తి జిల్లా కొత్తకోట బైపాస్ రోడ్డు దాటిన తర్వాత మినీబస్సు వెనుక టైర్ పగలడంతో రోడ్డుపైనే ఆగిపోయింది. దీంతో మినీబస్సు డ్రైవర్ మహ్మద్ ఉస్మాన్ బస్సు పార్కింగ్ లైట్స్ వేసి టైర్ మార్చుతున్నాడు. హైదరాబాద్ నుంచి కర్నూల్ వెళ్తున్న డీసీఎం డ్రైవర్ అజాగ్రత్తగా, అతివేగంగా మినీబస్సును వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో సయ్యద్‌ముస్తాఫా(33) అక్కడికక్కడే మృతి చెందాడు. మహ్మద్ అజీమ్, వి.రవినాయక్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంలో సంఘటనా స్థలానికి చేరిన పోలీసులు క్షతగాత్రులను వనపర్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. డీసీఎం డ్రైవర్‌కు సైతం తీవ్ర గాయాలయ్యాయి. షేక్ హుస్సేన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సమాజాన్ని కదిలించేదే అసలైన కవిత్వం


కవి డాక్టర్ బాణాల శ్రీనివాసరావును సత్కరిస్తున్న ప్రతినిధులు

స్టేషన్ మహబూబ్‌నగర్: సమాజాన్ని కదిలించేదే అసలైన కవిత్వమని, అలాంటి కవిత్వమే ఎప్పటికీ నిలుస్తుందని హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం పాలమూరు సాహితీ ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలోని లిటిల్ స్కాలర్స్ స్కూల్ కాళోజీ హాల్‌లో పాలమూరు సాహితీ అవార్డు ప్రదానోత్సవం, హరితస్వప్నం పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పాలమూరు జిల్లా కవులకు నిలయమని, ఇక్కడి కవులు తెలుగు సాహిత్యరంగంలో విశేష కృషి చేశారన్నారు. కవి తనలో తాను సంఘర్షణ పడితేనే చక్కటి, చిక్కటి కవిత్వం ఆవిష్కరించబడుతుందన్నారు. కవి ఎప్పుడూ సమాజంలో నిలిచే కవిత్వం రాయాలన్నారు. ప్రముఖ న్యాయవాది వి.మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో నిరంతరం సాహిత్య సేవ చేస్తున్న పాలమూరు సాహితీ సంస్థను కొనియాడారు. కవి కోట్ల వెంకటేశ్వరరెడ్డి రచించిన 'హరితస్వప్నం' పుస్తకాన్ని ప్రముఖ కవి ఒద్దిరాజు ప్రవీణ్‌కుమార్ సమీక్షించారు. అనంతరం 2023 సంవత్సరానికి గాను పాలమూరు సాహితీ అవార్డును 'రాత్రి సింపని' కవి డాక్టర్ బాణాల శ్రీనివాసరావుకు అందజేశారు. ఈ పురస్కారం కింద శాలువా, మెమొంటోలతోపాటు రూ.5,116 నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది బుర్రి వెంకట్రామరెడ్డి, ప్రముఖ విద్యావేత్త కె.లక్ష్మణ్‌గౌడ్, డాక్టర్ కె.కృష్ణమూర్తి, పాలమూరు సాహితీ అధ్యక్షుడు డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్, బోల యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

నిందితుడికి రిమాండ్

బల్మూర్: బాలికనుపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడికి అచ్చంపేట కోర్టు మేజిస్ట్రేట్ రిమాండ్ విధించిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ గురుస్వామి వివరాల ప్రకారం.. మండలంలోని కొండనాగులకు చెందిన 9ఏళ్ల బాలిక బల్మూర్‌లోని వసతిగృహంలో ఉంటూ చదువుకుంటోంది. ఈనెల 25న బల్మూర్ గ్రామానికి చెందిన వంశీ బాలికకు మాయమాటలు చెప్పి తన బైక్‌పై తీసుకెళ్లాడు. మైలారం గుట్ట గుట్టవద్దకు తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడడంతో బాలిక కేకలు వేసింది. దీన్ని గమనించిన చుట్టు పక్కల వారు అక్కడికి రావడంతో యువకుడు పరారయ్యాడు. బాలిక వసతిగృహం చేరుకొని స్నేహితులకు విషయం చెప్పడంతో వార్డెన్ కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. బాలిక అమ్మమ్మ శనివారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేసింది. నిందితుడిని అరెస్ట్ చేసి అచ్చంపేట కోర్టు మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పర్చగా రిమాండ్‌కు ఆదేశించారు. బాలిక తల్లి ఐదేళ్ల క్రితం అనారోగ్యంతో చనిపోయింది. అమ్మమ్మ సంరక్షణలో బాలిక పెరుగుతున్నట్లు తెలిపారు.

కానిస్టేబుల్ వినోద్‌రెడ్డిపై వేటు

నాగర్‌కర్నూల్ (బిజినేపల్లి): బిజినేపల్లి స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ వినోద్‌రెడ్డికి జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ శనివారం రాత్రి సస్పెన్షన్ విధించినట్లు సీఐ కనకయ్య తెలిపారు. వినోద్‌రెడ్డి తన మనుమడి వద్ద ఓ కేసు సెటిల్‌మెంట్ చేస్తానని రూ.2 వేలు లంచం తీసుకున్నాడని పోలెపల్లికి చెందిన వెంకటయ్య ఉన్నతాధికారులకు పిర్యాదు చేశాడన్నారు. దీంతో విచారణ చేపట్టిన అధికారులు తక్షణమే చర్యలు తీసుకున్నారని వివరించారు.

లంచంగా పిచికారీ పంపు!

సంవత్సరం క్రితం ప్రేమ జంట కేసు విషయంలో ఓ వ్యక్తి నుంచి పంటలకు పిచికారీ చేసే పంపును వినోద్‌రెడ్డి లంచంగా తీసుకున్నట్లు మండల కేంద్రంలో జోరుగా చర్చగా సాగుతోంది. గణేష్ నిమజ్జన సమయంలో ఆయా గ్రామాల్లో ఉత్సవ కమిటీలు డీజేలను ఏర్పాటు చేసుకోగా.. డయల్ 100కు ఫోన్ వచ్చిందని వారి వద్ద నుంచి సైతం అతడు అందిన కాడికి దోచుకున్నాడని పలువురు వాపోతున్నారు. గత నాలుగు నెలలుగా బిజినేపల్లి మండలంలో తనకు తానుగా ప్రత్యేకంగా డ్రంకెన్ డ్రైవ్‌లు, బెల్టు దుకాణాల్లో ఫొటోలు తీయడం, డయల్ 100 పేరుతో డబ్బులు వసూళ్లు చేశాడనే ఆరోపణలు తీవ్రం అవుతున్నాయి. ఈ నేపథ్యంలో వినోద్‌రెడ్డిపై వేటు పడటంతో సామాజిక మాధ్యమాల్లో జోరుగా చర్చ సాగుతోంది.

రెండో మ్యాచ్‌లో జిల్లా జట్టు భారీ విజయం


ఉమ్మడి జిల్లా జట్టుతో రాజశేఖర్, కోచ్ అబ్దుల్లా

మహబూబ్‌నగర్ క్రీడలు: వరంగల్‌లో జరుగుతున్న హెచ్‌సీఏ అండర్–19 వన్డే అంతర్‌జిల్లా లీగ్ కం నాకౌట్ టోర్నమెంట్‌లో ఉమ్మడి జిల్లా జట్టు విజయాల పరంపర కొనసాగిస్తోంది. ఆదివారం వరంగల్‌లోని స్పోర్ట్స్ బాక్స్ గ్రౌండ్‌లో నల్లగొండ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో జిల్లా జట్టు 88 పరుగుల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన జిల్లా జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 186 పరుగులు చేసింది. జట్టులో ఓపెనర్ అబ్దుల్ రాఫే మెరుగైన ఇన్నింగ్స్ ఆడాడు. 134 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లతో 71 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నల్లగొండ జట్టు 32 ఓవర్లలో 98 పరుగులకు ఆలౌట్ అయింది. జిల్లా బౌలర్లు మహ్మద్ షాదాబ్ అహ్మద్ 3, కనిష్క 3, శశాంక్ 2, ముఖితుద్దీన్ 2 వికెట్లు తీశారు. రెండు మ్యాచుల్లో వరుస విజయాలతో పూల్–ఏ నుంచి ఉమ్మడి జిల్లా జట్టు సెమీఫైనల్‌కు చేరింది. టోర్నమెంట్‌లో ఉమ్మడి జిల్లా జట్టు మూడో మ్యాచ్ సోమవారం మెదక్ జట్టుతో తలపడనుంది.

ఎండీసీఏ అభినందన

టోర్నీలో రెండో మ్యాచ్ గెలుపొంది సెమీఫైనల్‌కు చేరిన ఉమ్మడి జిల్లా జట్టును ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ అభినందించారు. రానున్న మ్యాచుల్లో ఇదే విధంగా సమష్టి ప్రతిభకనబరిచి చాంపియన్‌గా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో శివశంకర్, కోచ్ అబ్దుల్లా పాల్గొన్నారు.

టెక్నాలజీ వల్లే ఇబ్బందులు


మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: మనిషికి టెక్నాలజీ వల్లే అనేక ఇబ్బందులు వస్తున్నాయని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. జిల్లా కేంద్రంలో మారుతున్న సమాజం–ప్రజాస్వామ్యం అనే అంశం పై ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. చాలా మంది టెక్నాలజీని వ్యక్తులకు చెడు చేసేందుకు వాడుతున్నారని అన్నారు. సాధారణ ప్రజలకు సైతం వేధింపులు పెరిగిపోయాయన్నారు. సైబర్ నేరాలు చేసే వారికి సరైన విద్యా విలువలు లేకపోవడం వల్ల ఇలాంటి పరిస్థితులు వస్తున్నాయన్నారు. వస్తువులకు ఉన్న విలువ మనుషులకు లేకుండా పోయిందని, కామన్ విద్యావిధానంలో అందరికీ సమాన విద్య అందినప్పుడు మాత్రమే సమాజంలో మార్పువస్తుందన్నారు. ప్రభుత్వాలు ప్రజలకు చెందాల్సిన ఖనిజాలను బడా కంపెనీలకు దోచిపెడుతున్నాయని ఆరోపించారు. పాలన మీద ప్రజలకు నమ్మకం పోతే శ్రీలంక, బంగ్లాదేశ్ వంటి పరిస్థితులు తలెత్తుతాయన్నారు. రిటైర్డ్‌మెంట్ జరుపుకోనున్న ఉపాధ్యాయుడు శ్రీశైలంను సన్మానించారు. కార్యక్రమంలో ఆదిత్య, వెంకటేశ్వర్లు, వామన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

జూరాలకు తగ్గిన ఇన్‌ఫ్లో


జూరాల నుంచి దిగువకు విడుదలవుతున్న వరద నీరు

ధరూరు : జూరాలకు ఇన్‌ఫ్లో తగ్గినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ఆదివారం ఎగువ నుంచి 72 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు వివరించారు. 4 క్రస్టు గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. 5 యూనిట్లను కొనసాగించి విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు. గేట్ల ద్వారా, ఆవిరిరూపంలో, విద్యుదుత్పత్తి నిమిత్తం, కాల్వలకు ఇలా మొత్తంగా 68,647 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 9.480 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు.

నిండుకుండలా రామన్‌పాడు

మదనాపురం: రామన్‌పాడు జలాశయంలో ఆదివారం నాటికి పూర్తిస్థాయి నీటిమట్టం 1021 అడుగుల కు చేరింది. జూరాల ఎడమ కాల ద్వారా 835 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. సమాంతర కాల్వ ద్వారా వచ్చే నీటిని నిలిపివేశారు. ఎన్టీఆర్ కాల్వ ద్వారా 950 క్యూసెక్కులు, కుడి, ఎడమ కాల్వ ద్వారా 20 క్యూసెక్కులు తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని ఏఈ సింగిరెడ్డి రనీల్ రెడ్డి తెలిపారు.

సుంకేసులలో నిలకడగా ఇన్‌ఫ్లో..

రాజోళి: సుంకేసుల డ్యాంలో ఇన్‌ఫ్లో నిలకడగా కొనసాగుతుంది. శనివారం ఒక గేటు ద్వారా నీటి విడుదల చేయగా ఆదివారం కూడా ఒక గేటును తెరిచి నీటి విడుదల చేశారు. ఎగువ నుంచి 4,709 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉండగా.. దిగువకు 2,264 క్యూసెక్కులు, కేసీ కెనాల్‌కు 2,445 క్యూసెక్కులు నీటిని విడుదల చేసినట్లు జేఈ రాజు తెలిపారు.

11 యూనిట్లలో విద్యుత్ ఉత్పత్తి

ఆత్మకూర్: జూరాల జల విద్యుదుత్పత్తి కేంద్రాల్లో.. విద్యుదుత్పత్తి నిరంతరాయంగా కొనసాగుతోంది. ఆదివారం 11 యూనిట్లలలో ఉత్పత్తి చేపట్టినట్లు ఎస్‌ఈ సూరిబాబు తెలిపారు. ఎగువలో 5 యూనిట్లద్వారా 196 మెగావాట్లు, 208.565 ఎంయూ, దిగువలో 6 యూనిట్ల ద్వారా 240 మెగావాట్లు, 182.210 ఎంయూ విద్యుదుత్పత్తిని చేపట్టామన్నారు. ఇప్పటివరకు 390.775 మిలియన్ యూని ట్ల విద్యుదుత్పత్తిని సాధించామని తెలిపారు.

శ్రీశైలంలో నీటిమట్టం 880.2 అడుగులు..

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో ఆదివారం నీటిమట్టం 880.2 అడుగుల వద్ద ఉండగా.. 189.0148 టీఎంసీల నీటి నిల్వ ఉంది. జూరాల, సుంకేసుల నుంచి మొత్తం 76,027 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. భూగర్భకేంద్రం, ఏపీజెన్‌కో పరిధిలో విద్యుత్ ఉత్పత్తికి మొత్తంగా 50,910 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. గత 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 13,000 క్యూసెక్కులు, ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్‌కు 1,460 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్‌ఐకు నీటి విడుదల జరగలేదు. భూగర్భ కేంద్రంలో 15.561 మిలియన్ యూనిట్లు, కుడిగట్టు కేంద్రంలో 6.103 మి.యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి చేశారు.

కోయిల్‌సాగర్‌లో ఒక గేటు ద్వారా నీటి విడుదల

దేవరకద్ర: ఎగువన కురుస్తున్న వర్షాలకు పెద్దవాగు ప్రవాహం వస్తుండటంతో కోయిల్‌సాగర్ ప్రాజెక్టు నుంచి నీటి విడుదలను కొనసాగిస్తున్నారు. అయితే ఆదివారం ప్రవాహం కొద్దిమేర తగ్గడంతో ఒక గేటును అడుగు మేర ఎత్తి 400 క్యూసెక్కుల నీటిని వాగులోకి వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 32.6 అడుగులు కాగా ప్రస్తుతం 32.5 అడుగుల మేర నిల్వ చేస్తూ వచ్చిన నీటిని వచ్చినట్లే వదులుతున్నారు.

సందర్శకుల సందడి....

ఆదివారం సెలవు రోజు కావడంతో ప్రాజెక్టును చూడడానికి సందర్శకులు పెద్దఎత్తున తరలివచ్చారు. సందర్శకుల సందడితో ప్రాజెక్టు కళకళలాడింది. ప్రాజెక్టు కుడి వైపున ప్రత్యేకంగా వెలసిన చేపల విక్రయ దుకాణాల వద్ద వ్యాపారం జోరుగా సాగింది. చేప ఫ్రైతోపాటు చేపల పులుసును ప్రత్యేకంగా తయారు చేసి పర్యాటకులకు అందించారు. అలాగే ఎడమ కాల్వ గట్టున కూడా వ్యాపారం జోరుగా సాగింది.